



కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 81
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శనివారం 2 ఆగష్టు 2025

# మగ్గాలున్న చేనేతలకు ఉచిత విద్యుత్

● కొత్తగా 1.09 లక్షల స్పౌజ్ పింఛన్లకు రూ.520 కోట్లు ● త్వరలో కడప స్టీల్‌ప్లాంట్ పనులు చేపడతాం...2029 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తాం ● ఘరానా మోసగాడు జగన్ ● మహిళలను బూతులు తిడితే మందలించాల్సింది పోయి ఇంకా తిట్టమని ప్రోత్సహిస్తున్నాడు ● చెడగొట్టడానికి, పడగొట్టడానికే వైసీపీ ఉంది ● సొంత టీవీ, పత్రికలో తప్పుడు ప్రచారాలు

-జమ్మలమడుగు ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు ● పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన సీఎం ● ప్రజావేదికకు ఆటోలో వెళ్లిన చంద్రబాబు






**జమ్మలమడుగు,కలంకౌంటర్ :** చేనేతలకు చేయూతనిచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. మగ్గాలున్న చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు నిర్ణయాన్ని వెల్లడించారు. శుక్రవారం కడప జిల్లా జమ్మలమడుగులో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో సీఎం ఈ ప్రకటన చేశారు. పవర్ లూమ్స్ ఉన్నవారికి 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్ ఉన్నవారికి 200 యూనిట్ల మేర విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈనెల 7వ తేదీన అంతర్జాతీయ చేనేత దినోత్సవం రోజు నుంచి ఈ పథకం అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించడంతో పాటు పెట్టుబడుల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తన సింగపూర్ పర్యటన విశేషాలను చెప్పారు. ఇదే సమయంలో వైసీపీ విధానాలను ఎండగట్టారు. చంద్రబాబు మాట్లాడుతూ... "రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు, రాష్ట్ర బ్రాండ్ పెంచేందుకు సింగపూర్ వెళ్లొచ్చాను. నేను ఎక్కడ ఉన్నా ఒకటో తేదీన పేదల సేవలో పాల్గొనేలా చూసుకుంటున్నాను. అవసరమైతే నా కార్యక్రమాలు వాయిదా వేసుకుంటాను. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏదో మొక్కుబడిగా కాకుండా ఒక బాధ్యతగా చేస్తున్నాం. రాష్ట్రంలో 64 లక్షల మందికి రూ.33 వేలకోట్లు వెచ్చిస్తున్నాం. దేశవ్యాప్తంగా పెన్షన్ల కోసం ఇంతపెద్ద మొత్తంలో ఖర్చు చేసేది ఏపీనే. మన రాష్ట్రం తర్వాత తెలంగాణ రూ. 8,170 కోట్లు, కేరళ రూ. 7,295 కోట్లు, హర్యానా రూ.7,194 కోట్లు, వెస్ట్ బెంగాల్, 5,460 కోట్లు, రాజస్థాన్, రూ.5,160 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నారు. 1,08,499 మందికి కొత్తగా వితంతు పెన్షన్లు ఇచ్చేందుకు రూ.43.40 కోట్లు విడుదల చేశాం. రెండు నెలల పాటు పింఛన్లు తీసుకోకపోయినా మూడు నెలలో కలిపి ఒకేసారి ఇస్తున్నాం. ఆస్పత్రుల్లో ఉన్న 14,703 మందికి, వృద్ధాశ్రమాల్లో ఉన్న 20,587 మందికి, ఒక సచివాలయ పరిధి నుంచి మరో సచివాలయ పరిధికి వెళ్లిన 31,496 మందికి, హాస్టళ్లలో ఉంటున్న దివ్యాంగ విద్యార్థులకు 3,683 మందికి ఇస్తున్నాం. ఇవి కాకుండా ఈ నెల నుంచి కొత్తగా 1.09 లక్షల మందికి స్పౌజ్ ఫించన్లు అందిస్తున్నాం. దీనికోసం రూ.520 కోట్లు ఖర్చు పెడుతున్నాం' అని సీఎం వివరించారు.

**చెడగొట్టడం తేలిక..నిలబెట్టడమే కష్టం..** 'దేన్నైనా చెడగొట్టడం, పడగొట్టడం చాలా తేలిక...నిలబెట్టడమే చాలా కష్టం. విధ్వంసం చేయడం నిమిషం పని. గత ఐదేళ్లు అదే జరిగింది. కేంద్రం ప్రాయోజిత పథకాలు నిలిపేశారు. రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారు. మే నెలలో జరిగిన మహానాడు వేదికగా కడప స్టీల్ ప్లాంట్ పనులు మొదలు పెడతామని చెప్పాం. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ముందుకొచ్చింది. రూ.4,500 కోట్లతో తొలి దశ, రూ.11,850 కోట్లతో రెండో దశ పనులు చేపడుతుంది. 2029 కల్లా ఉత్పత్తి ప్రారంభిస్తుంది. ఈ ప్రాజెక్టు వస్తే జమ్మలమడుగుతో పాటు పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాం. సాస్కి పథకం కింద రూ.80 కోట్లతో కేంద్ర పర్యాటకశాఖ పనులు చేపడుతోంది. అందమైన లోయలున్న గండికోటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం. 100 అడుగుల ఎత్తులో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ఏర్పాటు చేస్తాం. ఓవైపు గండికోట, మరోవైపు ఒంటిమిట్ట మధ్యలో కడప దుర్గా...ఈ మూడింటిని అనుసంధానం చేస్తే పర్యాటకంగా సీమ అభివృద్ధి చెందుతుంది' అని సీఎం వివరించారు.

**నాలుగు ఉమ్మడి జిల్లాలకు సాగునీరు..** 'రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకుంటున్నాం. నాడు హంద్రీనీవా, గాలేరి నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. తెలుగుగంగ ద్వారా సీమకు నీళ్లిచ్చాకే చెన్నైకి వెళతాయని చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్. హంద్రీనీవా పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నాం. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాం. హంద్రీనీవా ప్రాజెక్టుకు ఒక్క ఏడాదినే రూ.3,890 కోట్లు ఖర్చు చేశాం. జూలైలోనే మల్యాల ఎత్తిపోతల నుంచి సీమ జిల్లాలకు నీరు విడుదల చేశాం. ఫేజ్ 2 పనులు త్వరలో పూర్తిచేసి కడప జిల్లాలో 37,500 ఎకరాలకు సాగునీరు అందిస్తాం. గండికోట ప్రాజెక్టు ఎన్టీఆర్ ప్రారంభిస్తే నేను పూర్తి చేశాను.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**జగన్ ఘరానా మోసగాడు ..** 'వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఘరానా మోసగాడు. సొంత పత్రిక, టీవీని అడ్డంపెట్టుకుని తప్పుడు ప్రచారాలతో ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. సాక్షి మీడియాను అనుసరిస్తే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్టే. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన మందలించాల్సిందిపోయి...ఇంకా నోటికొచ్చినట్టు మాట్లాడాలని ప్రోత్సహించడాన్ని ఏమనాలి.? పార్టీ అధినేతగా ఉన్న వ్యక్తి తన పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలను

- 2లో

# కొత్త బార్ పాలసీపై మంత్రుల బృందం కీలక భేటీ

-ఆగస్టు 31తో ముగియనున్న ప్రస్తుత పాలసీ గడువు




**అమరావతి,కలంకౌంటర్ :** ప్రస్తుత బార్ పాలసీ గడువు ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో, నూతన ఎక్సైజ్ విధానంపై మంత్రుల బృందం శుక్రవారం ఒక కీలక సమావేశం నిర్వహించింది. మంగళగిరి ఎక్సైజ్ కమీషనర్ కార్యాలయం నుంచి హైబ్రిడ్ మోడ్‌లో జరిగిన ఈ సమావేశంలో రాబోయే కొత్త బార్ పాలసీ రూపకల్పన పై లోతైన చర్చ జరిగింది. సమావేశానికి ఎక్సైజ్, ఖనిజ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, సెర్ప్ మరియు ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్ కుమార్ ప్రస్తుతం అమలులో ఉన్న 2022%-%25 బార్ పాలసీపై సమగ్రంగా వివరించారు. ప్రస్తుత పాలసీ క్రింద రాష్ట్రంలో 840 స్టాండలోన్ బార్లు, 50 స్టార్ హెూటల్స్, మైక్రోబ్రూరీస్ లాంటి సంస్థలకు లైసెన్సులు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే 44 బార్ లైసెన్సులు గడువు ముగిసిన తర్వాత రిన్యువల్ కాలేదని తెలియజేశారు. పక్కటి రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ మరియు కేరళల బార్ విధానాలపై పోలికలు

- 2లో

# సింగపూర్ లో పర్యటిస్తున్న మంత్రి నారాయణ

● అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించడానికి అవసరమైన పద్ధతులను అధ్యయనం చేస్తున్న మంత్రి ● సింగపూర్ లోని ALBA వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను పరిశీలించిన మంత్రి నారాయణ ● ప్లాస్టిక్ వ్యర్థాలు,ఈ - వేస్ట్ ను రీ సైక్లింగ్ చేయడం,ఇతర వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాలను అధ్యయనం చేసిన మంత్రి ● సింగపూర్ పోలీస్ ఫోర్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి ● రాత్రికి సింగపూర్ నుంచి మలేషియా బయలుదేరిన మంత్రి నారాయణ







**సింగపూర్,కలంకౌంటర్ :** అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా నిర్మించేలా అవసరమైన పద్దతులపై అధ్యయనం చేస్తున్నారు మంత్రి నారాయణ...గత ఆరు రోజులుగా సింగపూర్ లో పర్యటిస్తున్న మంత్రి నారాయణ....వివిధ నిర్మాణాలు,ప్రాజెక్ట్ లను అధ్యయనం చేయడంతో పాటు పలువురు ప్రముఖులతో సమావేశమవుతున్నారు...శుక్రవారం ఉదయం సింగపూర్ లోని ALBA వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు...ఈ ప్లాంట్ లో ఘన వ్యర్థాలను వివిధ రూపాలుగా మార్చనున్నారు..ఇళ్లు,పరిశ్రమల నుంచి సేకరించిన ఘన వ్యర్థాలను అధునాతన టెక్నాలజీతో తయారుచేసిన వాహనాల్లో ఈ ప్లాంట్ కు తరలిస్తారు..ఇక్కడ ప్లాస్టిక్ రీసైక్లింగ్ తో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేయనున్నారు...మిగిలిన ఘన వ్యర్థాలను వేస్ట్ టు ఎనర్జీగా మారుస్తున్నారు...వ్యర్థాల సేకరణ నుంచి వాటిని రీసైక్లింగ్ చేసే వరకూ ఎలాంటి పద్దతులు అవలంబిస్తున్నారనేది సింగపూర్ అధికారులు మంత్రి నారాయణకు వివరించారు..ఏపీలో కూడా ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది...ఓవైపు రోజువారీ వచ్చే చెత్తను వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లకు తరలించడంతో పాటు ఈ - వేస్ట్ ను కూడా రీసైకిల్ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.. .సింగపూర్ లో అనుసరిస్తున్న విధానాలను ఏపీలో కొన్నిచోట్ల అమలుచేస్తే ఎలా ఉంటుందనే దానిపై సింగపూర్ అధికారులతో మంత్రి నారాయణ చర్చించారు. శుక్రవారం మధ్యాహ్నం సింగపూర్ పోలీస్ ఫోర్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు మంత్రి నారాయణ.సింగపూర్ లో చట్టాల అమలు,శాంతి భద్రతల పరిరక్షణ వంటి అంశాలతో పాటు నేరాలను అరికట్టేందుకు ఉపయోగిస్తున్న సాంకేతిక గురించి అక్కడి పోలీస్ ఉన్నతాధికారులు మంత్రి నారాయణకు వివరించారు.ఆ తర్వాత సింగపూర్ కాలమానం ప్రకారం రాత్రికి అక్కడి నుంచి మలేషియా బయలుదేరి వెళ్లారు మంత్రి నారాయణ.మలేషియాలోనూ అర్బన్ డెవలప్ మెంట్,ట్విన్స్ టవర్స్ తో పాటు కన్వెన్షన్ సెంటర్లు,రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ వంటి అంశాలపై అక్కడి అధికారులతో కలిసి పరిశీలించనున్నారు.

# ఆటో ఎక్కి.. ప్రజావేదికకు.. వినూత్నంగా సీఎం చంద్రబాబు పర్యటన!







**కడప జిల్లా జమ్మలమడుగు,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడప జిల్లా జమ్మలమడుగు పర్యటనలో వినూత్న రీతిలో ప్రయాణించారు. ఆయన ఆటో ప్రయాణం రాష్ట్రాన్ని పునర్నిర్మించే మార్పుగా అభివర్ణించవచ్చు. శుక్రవారం కడప జిల్లా జమ్మలమడుగులో నిర్వహించిన ప్రజావేదిక వద్దకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆటోలో చేరుకున్నారు. 'పేదల సేవలో' పేరుతో జరుగుతున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా బాబు చేసిన ప్రయాణం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఓ వితంతు పెన్షన్ లబ్ధిదారైన అలివేలమ్మను ఆమె ఇంటికి వెళ్లి స్వయంగా కలిశారు. ఆమె కుటుంబ సభ్యులతోపాటు ఇంట్లోని పరిస్థితులను కూడా స్వయంగా చూసి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రిని ఆప్యాయంగా ఆహ్వానించిన అలివేలమ్మ తనకు ఇద్దరు కొడుకులు ఉన్నారని, చిన్న కొడుకు జగదీష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండగా, పెద్ద కొడుకు వేణుగోపాల్ తనలాగే చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడని తెలిపారు. ఆమె నిత్య జీవితంలో ఎక్కువ సమయం గడిపే తన నూలు నేసే యంత్రాన్ని ముఖ్యమంత్రికి చూపించారు. ఈ సందర్భంగా మీకే సహాయం కావాలని ముఖ్యమంత్రి అడగగా.. ఆమె తన చిన్న కుమారుడైన జగదీష్‌కు ప్రభుత్వ శాఖల్లో డ్రైవర్ పోస్టును కల్పించాల్సిందిగా కోరారు. మరోవైపు తన ఇంటికి పైకప్పు (స్లాబ్) వేయడానికి ఆర్థిక సహాయం అందించాలని అభ్యర్థించారు. ఈ మేరకు అవసరమైన అన్ని సహాయాలు ప్రభుత్వం అందిస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. పెన్షన్ పంపిణీ అనంతరం, జగదీష్ అభ్యర్థన మేరకు సీఎం చంద్రబాబు ఆటోలో ప్రయాణించేందుకు అంగీకరించారు. అలివేలమ్మ ఇంటి వద్ద నుంచి సభ వేదిక వరకు జగదీష్ ఆటోలో ప్రయాణించారు. సీఎం అక్కడే ఆ ఆటోలో డ్రైవర్ సీటులో జగదీష్ పక్కన కూర్చొన్నారు. ప్రజావేదికకు చేరుకున్న తర్వాత జగదీష్, "ఈ క్షణం జీవితాంతం మర్చిపోలేను" అంటూ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రజావేదిక వద్ద ముఖ్యమంత్రి ప్రసంగించారు.



# పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్




**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా పోలీసుశాఖలో వివిధ హెరీదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించుటలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించి, వాటి పరిష్కారానికి న జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

# ఐఐటీలకు పోటీగా ప్రకాశం ఇంజినీరింగ్ విద్యార్థికి 7.5 లక్షల ప్యాకేజీ!



**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల 2025 బ్యాచ్‌కు చెందిన విద్యార్థి పీ. ప్రసాద్ ప్రముఖ మల్టీ నేషనల్ టెక్నాలజీ సంస్థ తేజస్ నెట్‌వర్క్స్‌లో రూ. 7.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగావకాశం పొందాడు. సాధారణంగా ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థల విద్యార్థులను మాత్రమే ఎంపిక చేసుకునే ఈ సంస్థలో, ప్రైవేట్ కళాశాల విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణం. కాలేజీలో అందించిన శిక్షణ, మెంటరింగ్, మాక్ ఇంటర్వ్యూలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు అతడిని ఈ స్థాయికి చేర్చాయి. ఈ సందర్భంగా కళాశాల కారస్పాండెంట్ డా. కంచర్ల విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి కంపెనీలో ఈ స్థాయి ప్లేస్‌మెంట్ కళాశాల ప్రతిష్టను, విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తున్నదని పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్స్ విజయవంతంగా సాగేందుకు కళాశాల ట్రెజరర్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అందించిన మద్దతును ప్రత్యేకంగా గుర్తుచేశారు. ప్రిన్సిపాల్ డా. చదలవాడ రవి కుమార్ మాట్లాడుతూ, కాలేజీలో అందించే శాస్త్రీయ శిక్షణ, పరిశోధన దృక్పథం, సాంకేతిక పరిజ్ఞానం వల్లే ఈ రికార్డు స్థాయి ఉద్యోగం సాధ్యమైందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం, ధైర్యం, నెట్‌వర్కింగ్ సామర్థ్యాన్ని తీర్చిదిద్దడంలో కళాశాల పాత్ర కీలకమని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వి. హరి బాబు మాట్లాడుతూ, ఈ విజయంతో ఇతర విద్యార్థులకు ప్రేరణ లభించనుందన్నారు. ఇది వ్యక్తిగత ఘనత మాత్రమే కాకుండా, బోధనా సిబ్బంది, శిక్షణా వ్యవస్థ కలిసి ఇచ్చిన ఫలితమని అభిప్రాయపడ్డారు. కళాశాల పరిశోధన, అభివృద్ధి విభాగాధిపతి డా. ఎం. లక్ష్మణరావు, అకడమిక్ ఇన్చార్జి షేక్ మీరావలి, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్లు డా. కె. సుబ్బారెడ్డి, డా. కె. మోహన్ రావు, ఎం.ఎం. రాయుడు, అన్ని శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పీ. ప్రసాద్‌ను హృదయపూర్వకంగా అభినందించారు.

# ప్రజలకు సంక్షేమ అందించడంలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఏపీ - ఎమ్మెల్యే ఇంటూరి..

**-నియోజకవర్గంలో కొత్తగా 714 వితంతు పెన్షన్లు ఎమ్మెల్యే**




**కందుకూరు, కలంకౌంటర్ :** భారతదేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. లింగసముద్రం మండలంలో శుక్రవారం ఉదయం జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తగా 714 వితంతు పెన్షన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో భర్త పెన్షన్ తీసుకుంటూ చనిపోయి-న తరువాత భార్యలకు ఇచ్చే వితంతువు పెన్షన్ లకు కూడా ఇవ్వలేదని, కానీ కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సారథ్యంలోని ప్రభుత్వం వచ్చాక భర్త చనిపోయిన నెలరోజుల లోపే తిరిగి పెన్షన్ అందిస్తున్నామని చెప్పుకోవడానికి ఎంతో గర్వంగా ఉందని ఎమ్మెల్యే తెలియజేశారు. గత వైసిపి ప్రభుత్వం లో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఏ హామీని పూర్తిగా అమలు చేయలేదని కానీ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన సూపర్ సిక్స్ హామీలలో 90 శాతం హామీలను నెరవేర్చామని ఎమ్మెల్యే తెలియజేశారు. గత ఐదేళ్లలో చేసిన విధ్వంసం సరిపోదన్నట్టుగా, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు జగన్మోహన్ రెడ్డి పరామర్శల పేరుతో యాత్రలు చేస్తున్నారని, అక్రమాలు చేసి కోట్ల రూపాయల సంపాదించుకుని జైలులో ఉన్న నేతలకు పరామర్శలు, ఆడవారిపై అసభ్యకరంగా మాట్లాడిన నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిని జగన్ పరామర్శించాడు అంటే మహిళలకు వైసీపీ ఇచ్చే గౌరవం ఏంటో తెలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు, లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ పార్టీ నాయకులు జనసేన నాయకులు కొణిదెల శీను అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు, కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు..

# ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పరిశీలన - జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్





**ఒంగోలు,కలంకౌంటర్ :** అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు దర్శి మండలం, తూర్పువీరాయపాలెం గ్రామానికి వస్తున్న నేపథ్యంలో ముందస్తుగా భద్రతా ఏర్పాట్లను ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోధర్ జిల్లా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, వీఐపీ వాహనాల రాక-పోకలు, పార్కింగ్ ఏరియా, సీఎం ప్రవేశం, నిష్క్రమణ స్థలాలతో పాటు, హెలిప్యాడ్ నుండి ప్రజా వేదిక వరకు ఉన్న రూట్ మ్యాప్‌ను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. పర్యటన సజావుగా సాగేందుకు కట్టుదిట్టమైన భద్రతా మరియు బందోబస్తు, డ్రోన్ కెమెరాలు మరియు సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని,ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అన్ని చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అత్యంత పకడ్బందీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, సీఎం పర్యటన నిమిత్తం పూర్తి స్థాయిలో బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ, ఒంగోలు డి.ఎస్.పి ఆర్ శ్రీనివాసరావు, మార్కాపురం డి.ఎస్.పి యు నాగరాజు, ఎస్పీ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, దర్శి సీఐ రామారావు, త్రిపురాంతకం సీఐ అసాం , సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

# ఎన్డీఏ ప్రభుత్వం హామీలన్నీ నెరవేరుస్తోంది: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు




**తిరుపతి,కలంకౌంటర్ :** పెన్షన్లు సమయానికి లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి అందిస్తున్న ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్పౌజ్ పెన్షన్ లను ఐదేళ్ళ తరువాత మ-ుఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు పునరిద్ధరించారని ఆయన చెప్పారు. రెండో డివిజన్ సచివాలయం ఒకటి పరిధిలో పెన్షన్లను ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ఉదయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతిలో 18 వేల 773 మందికి 8 కోట్ల 25 లక్షలా 7 వేల 500 ల రూపాయులు ప్రతి నెలా అందిస్తున్నట్లు చెప్పారు. 2019 మే నుంచి 2024 అక్టోబర్ వరకు నిలిచిపోయిన స్పౌజ్ పెన్షనలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు అందించినట్లు ఆయన తెలిపారు. తిరుపతిలో 285 మందికి స్పౌజ్ పెన్షన్లు అందుకున్నారని ఆయన చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని ఆయన తెలిపారు. శనివారం అన్నదాత సుఖీభవ పథకం తొలివిడతగా పిఎం కిసాన్ తో కలిపి ఏడు వేల రూపాయలను రైతుల ఖాతాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జమ చేయనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే ఈనెల 15వ తేదీ ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనుందని ఆయన తెలిపారు. మహిళలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందించిందని ఆయన చెప్పారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి 15వేల రూపాయలు ఎన్డీఏ ప్రభుత్వం చెల్లించిందని ఆయన తెలిపారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా మెగా డిఎస్సీని నిర్వహించడంతో పాటు వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తోందని ఆయన చెప్పారు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సూపర్ సిక్స్ అమలుపై అసత్య ఆరోపణలు చేస్తోందని ఆయన విమర్శించారు. పెన్షన్ ను రెండు వేల నుంచి మూడు వేలు పెంచడానికి ఐదు ఏళ్ళు తీసుకున్న వైసిపి నాయకులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మన కార్పోరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, ఎస్సీ కార్పోరేషన్ డైరక్టర్ కుమారమ్మ, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, డి.ఈ.రమణ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ నామినేసన్ల స్వీకరణ గడువు 15 ఆగష్టు 2025 వరకు పొడగింపు

**విజయవాడ,కలంకౌంటర్ :** వివిధ రంగాలలో పిల్లల అసాధారణ విజయాలను గుర్తించి వారిని అభినందించడానికి భారత ప్రభుత్వం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (PMRBP) వంటి ప్రతిష్టాత్మక జాతీయ అవార్డును బహుకరించనుందని కేంద్ర ప్రభుత్వ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి త్రిప్తి గుర్హ తెలిపారు. యువతకు మార్గదర్శకత్వం వహించడానికి ఏర్పాటు చేయబడిన ఈ అవార్డును ధైర్యం, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళ & సంస్కృతి మరియు సైన్స్ & టెక్నాలజీ అనే నాలుగు విభాగాల కింద అందించనున్నది. ఈ రంగాలలో నైపుణ్యం మరియు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు (జూలై 31, 2025 నాటికి) నామినేట్ కావడానికి అర్హులని త్రిప్తి గుర్హ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (PMRBP) అవార్డు ఎంపిక ప్రక్రియను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మరియు ఇతర సంబంధిత సంస్థల నుండి నామినేషన్లను స్వీకరిస్తారని, PMRBP నామినేషన్లు/సిఫార్సులు ఆన్‌లైన్‌లో భారత ప్రభుత్వం రూపొందించిన రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ (https://awards.gov.in) ద్వారా మాత్రమే స్వీకరించబడతాయని త్రిప్తి గుర్హ స్పష్టం చేసారు. ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో నామినేషన్లు అందుతున్నప్పటికీ, అర్హులైన చాలా మంది పిల్లలు ప్రజల్లో గుర్తింపు కోరుకోకపోవడంతో వారి ప్రతిభ కనుమరుగవుతుందని, కావున సాధ్యమైనంత ఎక్కువగా అర్హులైన పిల్లలను గుర్తించడంలో సమిష్టి ప్రయత్నాలు చేయాలని మరియు వారికి అనుకూలంగా తగిన నామినేషన్లు చేయాలని కేంద్ర ప్రభుత్వ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ కోరుతున్నది. PMRBP కోసం నామినేషన్లను సులభతరం చేయడానికి ఒక్కో విభాగం కొరకు ఒక్కో ప్రత్యేక లాగిన్ ID లను కేటాయించబడిందని, సిఫార్సులను ఖరారు.

# వితంతువులకు అండగా కూటమి ప్రభుత్వం

**- తెదేపా అధికార ప్రతినిధి గోచిపాతల మోషే.....**



**కందుకూరు, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల సంక్షేమం , రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తున్నాడని అందుకు నిదర్శనమే నూతనంగా వితంతువులకు మంజూరు చేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లేనని నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వితంతువు పెన్షన్ల కోసం మహిళలు ఎదురుచూసిన ఫలితం లేకుండా పోయిందని , నేడు కూటమి ప్రభుత్వం వితంతువుల మొహంలో ఆనందాన్ని నింపే విధంగా 4 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వడం శుభపరిణామం అన్నారు. పందలపాడు గ్రామంలో నూతనంగా నలుగురికి వితంతు పెన్షన్లు మంజూరయ్యాయని వారికి శుక్రవారం ఉదయం తెలుగుదేశం పార్టీ నాయకులు , సచివాలయం సిబ్బంది చేతులు మీదుగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. వితంతువు పెన్షన్లు మంజూరు చేయించిన కూటమి ప్రభుత్వానికి , ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కంజుల రామచంద్రారెడ్డి , కంజుల కృష్ణారెడ్డి , సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ చిత్తారి ఆదిలక్ష్మి , పార్టీ కార్యకర్తలు గోచిపాతల దావీదు , గోచిపాతల దావీదు తదితరులు పాల్గొన్నారు......

# కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసం వైభవం




**మచిలీపట్నం,కలంకౌంటర :** స్థానిక అజాద్ రోడ్ లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం శ్రావణమాస వైభవం వెల్లివిరిసింది. శ్రీ పార్వతి దేవి, శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి మాతకు సువాసినులు అభిషేకాలు చేశారు. అనంతరం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థానం పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, సామా వెంకట లక్ష్మీకాంతారావు, ఉడత్తు శ్రీనివాసరావు, బైసని హయగ్రీవ రావు అన్ని ఏర్పాట్లు చేశారు.

# అభివృద్ధి సంక్షేమం సమన్వయం చేస్తూ రాష్ట్ర అభివృద్ధి.. ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు,కలంకౌంటర్ :** అభివృద్ధి సంక్షేమం సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుకు తీసుకెళ్తున్నారని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.!లింగసముద్రం మండలం లింగసముద్రం పంచాయతీలోని ఎస్టీ కాలనీలో శుక్రవారం ఉదయం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయటం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనకు నిదర్శనం అని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పరంగా అట్టడుగు స్థాయికి దిగజారిన రాష్ట్రాన్ని ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వంలో గాడిలో పెట్టిందని అభివృద్ధిలో రాష్ట్రం దూసుకు వెళ్తుందని తెలిపారు. పంచాయతీలోని ఎస్టీ కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వ పనితీరును వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రైతుల పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రేపు దర్శి లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రైతుల ఖాతాలో జమ చేయనున్నారని అన్నారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు మహిళలు ఘన స్వాగతం పలికారు.. ఈ కార్యక్రమంలో లింగసముద్రం మండల పార్టీ అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ పార్టీ నాయకులు అడపా రంగయ్య, వంకాయలపాటి మాల్యాద్రి, అడపా నరసయ్య, దేవకి సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు కొణిదెల శీను అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు, కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు..

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ.!



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం కానూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణి కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా ఇంటింటికి పెన్షన్ పంపిణి కార్యక్రమం ఉదయం 6.30 గంటల నుండి ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామంలో 439 పెన్షన్లకు గాను 20.13 లక్షల రూపాయలు విడుదల చేయడం జరిగిందన్నారు. తెల్లవారుజామునే పెన్షన్లు ఇవ్వడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, కృతజ్ఞతలు తెలియజేసారు. ముఖ్యంగా స్పౌజ్ పెన్షన్ల పంపిణీ మరో విజయం అన్నారు. కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు, మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని 'గోపు' కోరారు. శనివారం రైతులకు అన్నదాత సుఖీభవ క్రింద, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 7000/- రూపాయలు రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర రావు,జనసేన పార్టీ ఇంచార్జి దివి మహేష్ , ఏడుకొండలు, పెద ఏడుకొండలు,పీతా రాము ,బొలిశెట్టి నాని ,కాశీ, జొన్నల నాగమల్లేశ్వర రావు , సిద్దిరెడ్డి పాండురంగారావు , రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పించన్ల పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో 26 డివిజన్ లో ఒకటో తేదీని పురస్కరించుకొని వృద్ధులు, వికలాంగులు,వితంతువులు,ఒంటరి మహిళలకు సచివాలయ సిబ్బంది సహకారంతో వార్డు టిడిపిఅధ్యక్షులు చెరుకూరి సూరిబాబు ప్రధాన కార్యదర్శి దిక్కొల్లువెంకట్రావు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లిషేక్ మౌలాలి నాగనబోయినరవి లిబూత్ ఇన్చార్జిలు వన్నెంరెడ్డి ప్రసాద్,షేక్ భాష కూటమి నాయకుల ఆధ్వర్యంలో పింఛన్లపంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు మాట్లాడుతూ 4375 జనాభా కలిగిన 26 వ డివిజన్ లో 442 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని ప్రతి నెల మొదటి తేదీన సచివాలయ సిబ్బంది సహకారంతో ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. 19 లక్షల 40 వేల రూపాయలను అర్హులైన పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ చేశామని గడ్డంరాజు తెలిపారు . ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడులి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్లి సహకారంతో మచిలీపట్నం అభివృద్ధికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పార్లమెంట్ సభ్యులు వల్లభనేనిబాలశౌరిలికృషి పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మచిలీపట్నం లిక్యాపిటల్ సిటీగా అభివృద్ధి చెంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రజలు విశ్వసిస్తున్నారని గడ్డం రాజు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందేలా కృషి చేస్తామని అర్హులైన వారిని గుర్తించడం జరిగిందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర దృష్టిలో పెట్టి వారికి కూడా ఫించను వచ్చే అవకాశం కల్పిస్తామని గడ్డం రాజు తెలిపారు. కార్యక్రమంలో చెరుకూరి సూరిబాబు, దిక్కొల్లు వెంకట్రావు,షేక్ మౌలాలి, నాగనబోయినరవి,షేక్ బాషా,వన్నెంరెడ్డి ప్రసాద్,గడ్డంరాజు పింఛన్ లబ్ధిదారులు సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మహిషాసుర మర్దని అమ్మవారికి లక్ష గాజుల అలంకరణ







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక చమనగిరిపేట గాంధీ బొమ్మ శివాలయంలో కొలువుతీరిన శ్రీ మహిషాసుర మర్దని అమ్మవారిని శుక్రవారం లక్ష పూల గాజులతో కన్నుల పండుగగా అలంకరించారు. ఆలయ అర్చకులు కందుకూరు చిట్టిబాబు, గట్టుపల్లి సాయి చరణ్ అమ్మవారిని భక్తులు సమర్పించిన గాజులతో నయనానందకరంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన శ్రావణమాసం శుక్రవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని దేసు అన్నపూర్ణ, చేబ్రోలు రాజసులోచన, చిట్టి కుమారి, చేబ్రోలు కుమారి పర్యవేక్షించారు. శుక్రవారం శ్రీ మహిషాసురమర్దిని సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవాలయం (గాంధీ బొమ్మ శివాలయం) లో శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ మహిషాసుర మర్దిని అమ్మవారికి లక్ష గాజుల అలంకరణ , సుహాసినిలచే సామూహిక వరలక్ష్మీ వ్రతములు సాయంత్రం మహిళా మణులచే కోలాటం , లలితా సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన సుహాసినిలకు పసుపు కుంకుమ , వెండి లక్ష్మీ దేవి రూపు అందజేశారు. ఈ సామూహిక వరలక్ష్మి వ్రతములు బ్రహ్మశ్రీ జొన్నలగడ్డ వాసు ,జొన్నలగడ్డ సాయి బ్రహ్మత్వంలో నిర్వహించటం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు తమ్మన రాధాకృష్ణ మూర్తి , యెండూరి సురేష్ , చేబ్రోలు బాబీ , గాయత్రి, నంబుల నాగ ప్రసాద్ (వాసు) , నంబూరి శ్రీనివాస్ , దేసు సూర్య ప్రకాశరావు , కొల్లిపర బాలాజీ, దుర్గ ప్రసాద్ పర్యవేక్షించారు.

# నేతన్నలకు చంద్రన్న గుడ్ న్యూస్

**● ఈ నెల 7 నుంచి ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం ● మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచితం ● ఏటా రూ.125 కోట్ల వ్యయం ● 65 వేల చేనేత కుటుంబాలకు లబ్ధి ● ఉచిత విద్యుత్ పథకం అమలుపై మంత్రి సవిత హర్షం ● నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు**



**అమరావతి,కలంకౌంటర్ :** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు గుడ్ న్యూస్ చెప్పింది. నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం కింద మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల అందజేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం ఈ నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం రోజు నుంచి వర్తింపజేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలుతో మరో ఎన్నికల హామీని సీఎం చంద్రబాబు అమలుచేసినట్లయింది. 2019-24 మధ్య అయిదేళ్ల పాటు ఆనాటి ప్రభుత్వ సహాయ నిరాకరణ వల్ల చేనేత కార్మికులు అన్ని విధాలా నష్టపోయారు. ఇదే విషయం గుర్తించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్... చేనేత కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, చేనేతలకు లబ్ధి కలిగేలా ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. నేత్నలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో రూ.10 వేల కోట్లతో నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చారు. ఈ పాలసీ ద్వారా 1.51 లక్షల మందికి ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ మొత్తం పెంచారు. మొదటి ఏడాది పెన్షన్ల రూపంలోనే రూ.370.89 కోట్లు లబ్ధిదారులకు చెల్లించారు. చేనేతలకు త్రిఫ్ట్ పథకం కింద 2024-25లో రూ.5 కోట్లు, 2025-26లోనూ త్రిఫ్ట్ పథకానికి మరో రూ.5 కోట్లు కేటాయించారు. క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నారు. నేటితరం అభిరుచులకు అనుగుణంగా నూతన వస్త్రాల తయారీలో అయిదు జిల్లాల్లో నేతన్నలకు నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. చేనేత వస్త్రాల విక్రయాలకు రాష్ట్రంతో పాటు దేశంలోని ఏడు నగరాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. ఆప్కో నేతృత్వంలో ఈ కామర్స్ ద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్ల వద్దకే చేనేత వస్త్రాలను డెలివరీ చేస్తున్నారు. జాతీయ హ్యాండ్‌లూమ్ అభివృద్ధి ప్రోగ్రామ్ కింద 2024-25లో 10 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. వీవర్స్ ముద్రా స్కీమ్ ద్వారా చేనేతలకు రుణాలు అందజేశారు. ముడి పదార్థాల సరఫరా పథకం నూలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నారు. విశాఖపట్నంలో రూ.172 కోట్లు యూనిటీ మాల్ నిర్మిస్తున్నారు. రాయదుర్గం, హిందూపురం, బ్రాండెక్స్లో టెక్స్ టైల్స్ పార్కుల అభివృద్ధితో పాటు ఎమ్మిగనూరు టెక్స్ టైల్స్ పార్క్ కూడా నిర్మించబోతున్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికి టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్, తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తోనూ ఒప్పందం చేసుకున్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.10 వేలు విలువ చేసే నూలును అందజేస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా వీవర్ శాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

**ఏటా రూ.125 కోట్ల వ్యయం...** చేనేతల ఆర్థిక వృద్ధికి మరో కీలక పథకం ఉచిత విద్యుత్ పథకానికి సీఎం చంద్రబాబునాయుడు పచ్చజెండా ఊపారు. రాష్ట్రంలో మగ్గాల మీద 50 వేల నేతన్నలు, మర మగ్గాలపై 11,500ల మంది ఆదారపడి జీవిస్తున్నారు. వారందరికీ ఉచిత విద్యుత్ పథకం వర్తింపజేసేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500ల ఉచితంగా అందజేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వంపై ఏటా రూ.125 కోట్ల మేర భారం పడనుంది.

**నేతన్నలకు జాతీయ చేనేత దినోత్సవ గిఫ్ట్..** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు కూటమి ప్రభుత్వం గిఫ్ట్ అందజేసింది. ఉచిత విద్యుత్ పథకం అమలు తీరుతెన్నులపై పెన్షన్ల పండగ నిమిత్తం కడప పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుతో రాష్ట్ర చేనేత, జౌళి శాఖామంత్రి సవిత చర్చించారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

**మంత్రి సవిత హర్షం..** నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం వర్తింప జేయడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేస్తూ, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉచిత విద్యుత్ పథకం వల్ల చేనేత కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో మేలు కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేనేతలకు మేలు కలిగేలా కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించడంతో పాటు వారి కుటుంబాలు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రణాళికలు అమలు చేస్తున్నారన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కలిగించేలా పలు ఒప్పందాలు చేసుకున్నారన్నామన్నారు. త్వరలోనే చేనేత సహకార సంఘాల ఎన్నికలకు నోటిఫికేష్ విడుదల చేస్తామని మంత్రి సవిత వెల్లడించారు.

# పులివెందుల జెడ్పీటీసీ గెలుచుకుని నీ స్థాయి నీకు తెలియజేస్తాం

**● అవినీతి సొమ్మంతా కేంద్ర దర్యాప్తు సంస్థలు కక్కిస్తాయి ● జగన్ కు సీఎం రమేష్ హెచ్చరిక**




**విశాఖపట్నం, కలంకౌంటర్ :** "ఉప ఎన్నికలో బీటెక్ రవి భార్యను పులివెందుల జెడ్పీటీసీగా గెలిపించుకుని నీ స్థాయి నీకు తెలియజేస్తాం" అని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సవాల్ విసిరారు. ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్ బాబులతో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పులివెందుల నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, ముఖ్యమంత్రిగా పనిచేసిన కుటుంబం ఆ ప్రాంతాన్ని కనీసం అభివృద్ధి చేయలేదని.. రాజ్యసభ సభ్యుడిగా తాను 100 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడమే నిదర్శనమని పేర్కొన్నారు. జగన్ హయంలో జరిగిన అవినీతి, అరాచకాలపై రాష్ట్ర పోలీస్ బిజీగా ఉంటే కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఎన్ ఫోర్స్ మెంట్ లు రంగంలోకి దిగి అవినీతి సొమ్ము కక్కిస్తాయని హెచ్చరించారు. వైసీపీ పాలనలో ఇసుక, లిక్కర్, భూములు, మెడికల్, విద్య తదితర రంగాల్లో జరిగిన అవినీతి నిగ్గు తేల్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనేక లేఖలు రాశానన్నారు. కక్ష సాధింపు రాజకీయాలను రాష్ట్రానికి పరిచయం చేసిన జగన్మోహన్ రెడ్డి ఆ పంథా మార్చుకోవాలని చుట్టూ ఉన్నవాళ్లు చెబుతున్నా ఇప్పటికీ వినడం లేదని తనకు సమాచారం ఉందన్నారు. సింహాచలం ధర్మకర్తల మండలి చైర్మన్ విషయంలో గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును ఎన్ని ఇబ్బందులు పెట్టారో గుర్తు చేశారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు కూటమి నేతలు ఎవర్నీ వేధించకుండా వదిలిపెట్టని జగన్మోహన్ రెడ్డి.. ప్రతిపక్షంలో ఉండగా ఇప్పుడు కక్షసాధింపు గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా వేధించిన పార్టీ గురించి, వ్యక్తుల గురించి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు వద్ద ప్రస్తావిస్తే.. "రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు మనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మీరు కూడా మీ మైండ్ సెట్ మార్చుకోండి" అని విస్పష్టంగా చెప్పి తన ఆవేశం మీద నీళ్లు చల్లారని వ్యాఖ్యానించారు. బీజేపీ విజయనగరం ఎంపీ స్థానానికి పోటీ చేసి పకడ్బందీ రాజకీయ వ్యూహంతో ఎన్నికలకు వెళ్తే వైసీపీకి నాలుగైదు సీట్లు కూడా వచ్చేవి కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో రాష్ట్రానికి విశేష ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. చంద్రబాబు అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ కాగా, జగన్మోహన్ రెడ్డిని అరాచకానికి బ్రాండ్ అంబాసిడర్ అని సీఎం రమేష్ అభివర్ణించారు. కూటమి పార్టీ నాయకులు తప్పు మాట్లాడితే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, అమిత్ షా మందలిస్తారని.. మహిళలను కించపరిచేలా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డిని వెనకేసుకుని రావడం జగన్మోహన్ రెడ్డి నైజాన్ని తెలియజేస్తుందన్నారు.

**లిక్కర్ స్కాంలో జగన్ దోషిగా తేలడం ఖాయం: గంటా...** జగన్మోహన్ రెడ్డి పర్యటనను అడ్డుకోవాలనుకుంటే అసలు ఆయన కాలు బయట పెట్టగలడా అని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును బయటకు రానివ్వకుండా గేటుకు తాళం వేయడం, హౌస్ అరెస్ట్ చేయడం తమకు కూడా వచ్చని.. ప్రజాస్వామ్యాన్ని గౌరవించే పార్టీ కావడం వల్ల అలాంటి చర్యల జోలికి తాము వెళ్లడం లేదన్నారు. లిక్కర్ స్కాంలో వేళ్లన్నీ జగన్ వైపే చూపిస్తున్నాయని, ప్రధాన దోషిగా తేలడం ఖాయమని చెప్పారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టించుకోకుండా, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పైన ఇప్పుడు చంద్రబాబు కక్ష సాధిస్తున్నారన్న జగన్ మాటల్లో పస లేదన్నారు. అధికారానికి ఎప్పుడూ దగ్గర కాలేననే వాస్తవాన్ని గుర్తించిన జగన్మోహన్ రెడ్డి ఫ్రస్టేషన్ పీక్స్ కు వెళ్లి మతి భ్రమించినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు.

**జగన్ నైజం ఫ్యాక్షనిజం: పంచకర్ల..** పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కక్ష సాధింపు రాజకీయాలను ప్రోత్సహించినట్టయితే జగన్ పరామర్శలు.. పర్యటనలు.. చేయగలిగేవాడే కాదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపైకి మా వాళ్లను పంపి హత్యలు చేయిస్తే అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యానాల ద్వారా నిజమైన ఫ్యాక్షన్ లీడర్ బుద్ధి బహిర్గతం చేసుకున్నారని విమర్శించారు. రాజకీయాల్లో ఉన్నవారు సైతం సిగ్గు పడేట్టుగా జగన్మోహన్ రెడ్డి పదజాలం ఉంటోందా%శ్రీ%ని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి అప్పలనాయుడు పాల్గొన్నారు.

# పర్యాటకంగా గండికోట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

**● డిసెంబరు 26,27 తేదీల్లో గండికోట ఉత్సవాలు ● సాస్కి పథకం కింద గండికోట పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం ● రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు పర్యాటక ప్రాజెక్టులకు రూ.500 కోట్ల విలువైన ఒప్పందాలు ● గండికోటలో ఏపీ టూరిజం ఇన్వెస్టర్స్ మీట్ కు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు**





**కడపజిల్లా/గండికోట,కలంకౌంటర్ :** పర్యాటకంగా గండికోట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం గండికోట వద్ద ఆంధ్రప్రదేశ్ టూరిజం ఇన్వెస్టర్స్ మీట్ కు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గండికోట ప్రాంతాన్ని యాంకర్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. ప్రకృతి వరప్రసాదంగా ఏర్పడిన గండికోట ప్రాంతం భారత్ గ్రాండ్ కాన్యన్ గా పేరొందిందని అన్నారు. దీంతో పాటు 13 శతాబ్దంలో కాకతీయులు నిర్మించి, ఆ తర్వాత విజయనగర రాజులు పాలించిన ఈ ప్రాంతం చారిత్రక సంపదకు ప్రతిరూపంగా ఉందని స్పష్టం చేశారు. గండికోట ప్రాంతాన్ని సాస్కి కింద రూ.78 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అద్భుతమైన పర్యాటక కేంద్రంగా గండికోటను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్ల నిర్మాణం చేపడతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పర్యాటక ప్రాంతాల్లో 50 వేల హోటల్ గదుల నిర్మాణం చేసేలా కార్యాచరణ చేపట్టామని ముఖ్యమంత్రి వెల్లడించారు. టూరిస్టులను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్ తో పాటు, ఎకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్ తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు సందర్శించిన వారికి మంచి అనుభూతి కలిగేలా రోప్ వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి కల్లా టెంట్ సిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గ్రాండ్ కాన్యన్ ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ కూడా సెప్టెంబరు నుంచి మొదలు అవుతాయన్నారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారావాన్ టూరిజం సర్వీసులు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు.

**రూ.500 కోట్ల విలువైన పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పందాలు..** రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఒప్పందాలు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. ఈజ్ మై ట్రిప్, హిల్టన్ హోటల్స్ సహా వివిధ సంస్థలు ఏపీ టూరిజం కార్పోరేషన్ తో రూ.500 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నాయి. గండికోటతో పాటు శ్రీశైలం, మంత్రాలయం, తిరుపతి తదితర ప్రాంతాల్లో హోటళ్ల నిర్మాణం, అడ్వెంచర్ స్పోర్ట్స్, హై రోప్, కయాకింగ్, జెట్ స్కీయింగ్ లాంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఒప్పందాలు కుదిరాయి. కేంద్రప్రభుత్వ పథకాలైన సాస్కి, స్వదేశ్ దర్శన్ పథకాల కింద గండికోట, బొర్రా గుహలు, అహోబిలం, నాగార్జున సాగర్ ప్రాంతాల్లో వివిధ టూరిజం ప్రాజెక్టులను సీఎం వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఏపీలో అమలు చేస్తున్న టూరిజం పాలసీలో భాగంగా పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పిస్తున్నామని అపారమైన అవకాశాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి పెట్టుబడి దారులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎకో టూరిజం, అడ్వెంచర్, క్రూయిజ్, వెల్ నెస్, కారావాన్, గోల్ఫ్, హెరిటేజ్, టెంపుల్ టూరిజం ప్రాజెక్టులకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. విశాఖ, అరకు వ్యాలీ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోటలను 7 యాంకర్ హబ్ లు గా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. అలాగే 25 థీమాటిక్ సర్క్యూట్ లను కూడా ప్రకటించామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టేలను కూడా ప్రోత్సహిస్తామని అన్నారు. రాష్ట్రస్థాయిలో 8 పర్యాటక ఈవెంట్లను నిర్వహించటంతో పాటు జిల్లాల వారీగానూ కార్యక్రమాలు, టూరిజం ఫెస్టివల్స్ నిర్వహిస్తామన్నారు. అంతకుముందు గండికోట గ్రాండ్ కాన్యన్ సందర్శించిన ముఖ్యమంత్రి అక్కడే ఉన్న టూరిస్ట్ గైడ్, పర్యాటకులతో కొద్దిసేపు మాట్లాడారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com